

అన్నప్రసాదాలు వడ్డించిన దేశ ఆర్థికమంత్రి

తిరుమల అన్నప్రసాద భవనంలో కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ శుక్రవారం మధ్యాహ్నం సందడి చేశారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలు వడ్డించిన ఆమె, కొందరితో మాట్లాడారు. భక్తులతో కలిసి ఆమె కూడా అన్నప్రసాదాలు స్వీకరించారు. కేంద్రమంత్రితో పాటు బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, భానుప్రకాష్‌రెడ్డి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

చెత్త వారిదే.. ఫిర్యాదూ వారిదే!



తిరుపతి నగరం అలిపిరి-జూపార్కు మార్గంలో రోడ్డుకు రెండువైపులా ఉన్న చెత్తను శుభ్రం చేయడం లేదని టీటీడీ నుంచి ఇటీవల కార్పొరేషన్‌కు ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. ఈక్రమంలో కమిషనర్ మౌర్య అలిపిరి రోడ్డును పరిశీలించి చెత్త లేకుండా చూడాలని సూచించారు. ఎవరు చెత్త వేస్తున్నారో నిఘా పెట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈనేపథ్యంలో శుక్రవారం టీటీడీకి చెందిన ట్రాక్టర్లు జూపార్క్ రోడ్డులో చెత్తవేయడాన్ని మున్సిపల్ సిబ్బంది చూసి అడ్డుకున్నారు. ఫొటోలు తీసి కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. వారే చెత్త వేసి, వారే ఎలా ఫిర్యాదు చేస్తారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అపరాధ రుసుం వేయాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కొత్త సాంకేతిక సవాళ్లే అజెండా

- వీటిని ఎదుర్కొనేందుకు మహిళా సాధికారత
- రేపటి నుంచి తిరుపతిలో జాతీయ సదస్సు
- నేడు, రేపు రానున్న ప్రముఖులు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'కొత్త సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు మహిళల సాధికారత' అంశాన్ని అజెండాగా తీసుకుని తిరుపతిలో ఆది, సోమవారాల్లో జాతీయ మహిళా సాధికారత సదస్సు జరగనుంది. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా నేతృత్వంలో జరిగే ఈ సదస్సుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సదస్సులో 'వికసిత్‌భారత్ కోసం మహిళల అభివృద్ధి, జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్' అంశాలకూ ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే భారత్ డిజిటల్ మార్పు, ఏఐ, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలపై చర్చ జరగనుంది. స్టెమ్‌మహిళల ప్రాతినిధ్యం పెంచడం, డిజిటల్ భద్రత, వ్యవసాయ రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెంచడంపైనా చర్చించనున్నట్లు అధికార యంత్రాంగం తెలిపింది. 2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో కొత్త సాంకేతిక ఆధారిత ఆర్థిక వ్యవస్థల్లో మహిళల చేర్పు వ్యూహాలపైనా చర్చించనున్నారు. ఈ సదస్సుకు పార్లమెంటుతో పాటు రాష్ట్రాల అసెంబ్లీల నుంచీ దాదాపు 250 మంది మహిళా ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. కాగా, సదస్సు జరిగే రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులు పరిశీలించారు. కన్వెన్షన్ సెంటర్‌లో సీటింగ్, వేదిక ఏర్పాట్లు క్రమపద్ధతిలో ఉండేలా చూడాలన్నారు.

వేదికపైన వీరే

'లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర మంత్రులు, లోక్‌సభ కమిటీ చైర్‌పర్సన్ పురందేశ్వరి, రాష్ట్ర కమిటీ చైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి. ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరవుతారు. 15న జరిగే ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారు' అని శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ మీడియాకు తెలిపారు.



రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

నేడు పార్లమెంటు, అసెంబ్లీ స్పీకర్ల రాక

మహిళా సాధికారత సదస్సు నేపథ్యంలో శనివారం సాయంత్రానికే పలువురు ప్రముఖులు తిరుపతికి చేరుకోనున్నారు. వారికి వసతి, బస, వాహనాల కేటాయింపులో జిల్లా యంత్రాంగం తలమునకలైంది. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా శనివారం సాయంత్రం 6గంటలకు ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోనున్నారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణసింగ్ కూడా రాబోతున్నారు. అసెంబ్లీ స్పీకర్ చింతకాలయ అయ్యన్నపాత్రుడు మధ్యాహ్నం 3.30గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని.. సాయంత్రం పార్లమెంటు స్పీకర్‌కు స్వాగతం పలుకుతారు. ఇక, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మధ్యాహ్నం 3గంటలకు తిరుపతికి చేరుకుని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తారు. ఇక, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ శనివారం చేరుకోనుంది. రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, సవిత, పయ్యావుల కేశవ్, వివిధ రాష్ట్రాలకు చెందిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ సభ్యులు ఒక రోజు ముందే తిరుపతికి రానున్నారు. మరికొందరు తిరుమల శ్రీవారిని దర్శించుకుని అనంతరం మహిళా సాధికారత సదస్సుకు హాజరు కానున్నారు. ఈ సదస్సు ముగింపు కార్యక్రమానికి సోమవారం గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొనున్నారు.

రేపు తిరుపతికి సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబు నాయుడు విజయవాడ నుంచి హెలికాప్టర్‌లో తాజ్‌హోటల్ సమీపంలోని హెలిప్యాడ్‌కు ఆదివారం ఉదయం చేరుకుంటారు. తిరుపతిలోని శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో జరిగే విట్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు విశ్వనాథం మనవరాలు కాదంబరి వివాహానికి ఉదయం 9గంటలకు హాజరవుతారు. తిరిగి రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. జాతీయ మహిళసాధికారత సదస్సు ప్రారంభకార్యక్రమంలో పాల్గొంటారు. డెలిగేట్లకు మధ్యాహ్నం ఆతిథ్యం ఇవ్వనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. హెలిప్యాడ్, రాహుల్ కన్వెన్షన్‌సెంటర్, శ్రీకన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించారు. సీఎం పర్యటనలో అప్రమత్తంగా ఉండాలని ఎక్కడా చిన్న పొరబాట్లకు తావు ఇవ్వరాదని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ మౌర్య, ఏఎస్పీ రవి మనోహరాచారి, ఆర్డీవో రామమోహన్, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్ ఆలోచనతో కొత్త ఒరవడికి శ్రీకారం



ప్రసన్నకుమార్ సూర్యదేవర

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఆలోచనతో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తెలిపారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'పార్లమెంట్‌లో మహిళ స్వశక్తీకరణ కమిటీలో 20మంది లోక్‌సభ, పది మంది రాజ్యసభ సభ్యులు ఉంటారు. లోక్‌సభ సభ్యులలో ఒకరు చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి ఈ కమిటీకీ చైర్‌పర్సన్. ఇలాంటి కమిటీలే అన్ని రాష్ట్రాల శాసనసభలు, శాసనమండలిలలో ఉంటాయి. గతంలో ఏ కమిటీకి ఆ కమిటీ.. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం.. పనిచేసుకునేవి. ఆ విధానానికి స్వస్తి పలికి, అన్ని రాష్ట్రాలలో జరిగే విషయాలను అందరూ తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో లోక్‌సభ స్పీకర్ తీసుకున్న చొరవతో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలో నిర్వహించే ఈ సదస్సు మూడోది. ప్రతి రాష్ట్రం నుంచి వచ్చే ప్రతినిధులు ప్రధానాంశాలపై చర్చిస్తారు' అని ఆయన వివరించారు.

సదస్సుకు 11 ఎలక్ట్రిక్ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా సాధికారత సదస్సుకు హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, అధికారుల కోసం 11 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ కేటాయించింది. ఆదివారం ఉదయం విమానాశ్రయం నుంచి రాహుల్ కన్వెన్షన్, అక్కడి నుంచి చంద్రగిరి కోట, తిరుమల, సోమవారం శ్రీకాళహస్తి, ఎయిర్‌పోర్టుకు నడుస్తాయి. డీపీటీవో జగదీష్ ఆధ్వర్యంలో బస్సులను ఎంపిక చేసి, అవసరమైన మార్పులు చేర్పులు చేస్తున్నారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లను కేటాయించారు.

సంప్రదాయ దుస్తుల్లో హాజరు కండి

రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సుకు సంప్రదాయ దుస్తుల్లో విధులు నిర్వర్తించాలని అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ దిశానిర్దేశం చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో శుక్రవారం విధులు కేటాయించిన నోడల్, లైజన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నట్లు చెప్పారు. నోడల్ అధికారులే కాకుండా ప్రతి రాష్ట్రానికి సూపర్‌వైజింగ్ నోడల్ అధికారులను నియమించామన్నారు. అతిథులు వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లేంత వరకు అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. లైజన్ అధికారులు అతిథులకు స్వాగతం నుంచి బస ఏర్పాటు చేసిన చోటు వరకు జాగ్రత్తగా చేరుకునేలా చూడాలన్నారు. పోలీసుశాఖ బందోబస్తు ఏర్పాట్లను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలన్నారు. అతిథులకు తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి దర్శనాలకు సంబంధించిన ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. డెలిగేట్లు బస చేసే హోటళ్ల వద్ద అంబులెన్సు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో జాతీయ మహిళా సాధికారత సదస్సును విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా సూక్ష్మసేద్యాధికారి బదిలీ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా సూక్ష్మసేద్యాధికారి, ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ జి.సతీష్ పదోన్నతిపై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ చిన్నరెడ్డయ్య రానున్నారు.



సతీష్

వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్‌గా రమణ

- బాధ్యతల స్వీకరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ ఎంవీ రమణ నియమితులయ్యారు. ఇప్పటివరకూ రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన డాక్టర్ రామచంద్రరావు డీన్ ఆఫ్ అగ్రికల్చర్‌గా వెళ్లారు. దీంతో రిజిస్ట్రార్‌గా రమణను అంటిల్ ఫర్ ద ఆర్డర్ ప్రాతిపదికన నియమించారు. చిత్తూరుకు చెందిన రమణ ఇరిగేషన్ ఇంజినీరింగ్, నీరు, భూసార సంరక్షణ రంగాల్లో చాలా అనుభవాన్ని గడించారు. 7 పీజీ, 2 పీహెచ్‌డీలకు మార్గదర్శకులుగా వ్యవహరించారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. 2013లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు. 2015లో ఏవీ కృష్ణయ్య స్మారక బంగారు పతకాన్ని యూనివర్సిటీ నుంచి స్వీకరించారు. తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా పని చేశారు. వ్యవసాయ యూనివర్సిటీలో 34 ఏళ్లుగా బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో కృషి చేశారు. శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను పలువురు అభినందించారు.

పెట్టుబడులతో రండి

8

- పర్యాటక రాన్ని అభివృద్ధి చేద్దాం
- ఇన్వెస్టర్లకు మంత్రి కందుల దుర్గేష్ పిలుపు
- తిరుపతిని మైస్ టూరిజం, యాంకర్ హబ్‌గా చేస్తామని ప్రకటన



సమావేశానికి హాజరైన ఇన్వెస్టర్లు, అధికారులు, ఔత్సాహిక పెట్టుబడిదారులు

శరవేగంగా క్రికెట్ స్టేడియం నిర్మాణం

వచ్చే నెలాఖరుకు సిద్ధం చేసేందుకు సన్నాహాలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరునగరిలోని గొల్లవానిగుంటలో మినీ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు ఎట్టకేలకు జోరందుకున్నాయి. గతంలో తొమ్మిదెకరాల్లో స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మాణ పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. వైసీపీ హయాంలో పనులు నత్తనడకన సాగాయి. రూ.2.5కోట్ల వ్యయంతో మైదానం చదును, హెడ్‌లైట్స్, వాటర్‌డ్రై సిస్టమ్, పిచ్, పచ్చిక, ప్రహరీ, విద్యుత్ సదుపాయం వంటి పనులకు నాలుగేళ్లు పట్టింది. సగం మేర పూర్తయినా పనుల్లో నాణ్యత లోపించిందనే విమర్శలున్నాయి. ఈక్రమంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక శాప్ చైర్మన్ రవినాయుడు శ్రద్ధ పెట్టారు. శాప్, స్మార్ట్‌సిటీ చెరోసగం నిధులు భరించేలా కలెక్టర్ వెంకటేశ్వర్ సమక్షంలో ఒప్పందం జరిగింది. పెవిలియన్, కారుపార్కింగ్, అధునాతన పిచ్, అదనపు క్రీడాంశాల వేదికలను సిద్ధం చేయదలచారు.



దీంతో మరో రూ. 2.5కోట్ల మేర శాప్ నిధులతో ఈఏడాది జూలైలో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. పెవిలియన్‌తోపాటు గ్యాలరీలు, డ్రస్సింగ్ రూమ్స్, క్యాంటీన్,ప్రత్యేక గదుల పనులు ఊపందుకున్నాయి. ప్రాక్టీస్ పిచ్‌లు, కార్‌పార్కింగ్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టుల పనులు కూడా త్వరలో ప్రారంభంకానున్నాయి. వచ్చే నెలాఖరుకు మినీ క్రికెట్ స్టేడియాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసేందుకు సిద్ధమవుతున్నారు. నగరంలో తొలి క్రికెట్ స్టేడియాన్ని సకల సౌకర్యాలతో ముస్తాబు చేస్తున్నామని రవినాయుడు చెప్పారు. క్రికెట్‌తో పాటు టెన్నిస్, షటిల్, కబడ్డీ, వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల వేదికలను అదనంగా తీసుకొస్తామన్నారు.

గత పాలకవర్గ తప్పిదాలపై తదుపరి విచారణకు ఆమోదం

- డీసీసీబీ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సభ్యుల సిఫార్సు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత పాలకవర్గ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసం, అవినీతి, అక్రమాలపై తదుపరి విచారణకు జిల్లా సహకార బ్యాంకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. శుక్రవారం స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయ ఆవరణంలో చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. డీసీవో లక్ష్మి మాట్లాడుతూ వైసీపీ సర్కారు హయాంలో అప్పటి చైర్‌పర్సన్ రెడ్డెమ్మ నాయకత్వంలో అప్పటి నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ బృందం పెద్దఎత్తున అవినీతికి పాల్పడిందంటూ వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్ వందమందికి పైగా సాక్షులను నాలుగు నెలల వ్యవధిలో విచారించి కలెక్టర్‌కు నివేదిక అందించారని చెప్పారు. ఆ నివేదికలో అంశాలపై సభ్యుల అభిప్రాయాలను తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. దాంతో సమావేశం ఏకగ్రీవంగా తదుపరి విచారణకు ఆమోదం తెలుపుతూ అప్పటి పాలకవర్గంపై విచారణ కొనసాగించాలని సిఫార్సు చేసింది.బ్యాంకుకు జరిగిన నష్టాలను వారినుంచే రాబట్టాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు నిష్పక్షపాతంగా తదుపరి విచారణ జరపాల్సిందేనని కోరారు. చైర్మన్ రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ ఈ నెలాఖరుతో ముగియనున్న ఖరీఫ్ పంట కాలంలో స్వల్పకాలిక రుణాల రూపేణా రూ.3 లక్షలు, దీర్ఘకాలిక రుణాల రూపేణా యూనిట్ ఆధారంగా రూ.20 లక్షల వరకు, స్వల్పకాలికేతర రుణాలుగా పంట రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉందన్నారు. గ్రామీణ గృహ తనఖా కింద రూ.5 లక్షల వరకు, పీఎం సూర్యఘర్ పథకం కింద ఒక్కొక్కరికి రూ.3 లక్షల వరకు పరిమితి లేకుండా విరివిగా రుణాలందించాలని సింగిల్ విండోల అధ్యక్షులకు సూచించారు. ఈ రుణాల ద్వారా సంఘాలను లాభదాయక మార్గాల్లో నడిపి గ్రామీణ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.బ్యాంకు సీఈవో శంకర్ బాబు, డీసీఏవో నారాయణమ్మ, ఏజీఎం సురేష్ బాబు, లీగల్ ఆఫీసర్ వై. గంగిరెడ్డి, 75 సింగిల్ విండోల అఫిషియల్, నాన్ అఫిషియల్ కమిటీల చైర్మన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర రెడ్డి

గోవిందధామానికి విశ్రాంత ఉద్యోగుల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న విశ్రాంతి ఉద్యోగుల సంఘం

చంద్రగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి స్వర్ణముఖినది ఒడ్డున నిర్మాణం జరుగుతున్న గోవిందధామానికి మండలంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం రూ.2.16 లక్షల విరాళం అందజేసింది. ఈవిరాళాన్ని గోవిందధామం కమిటీ సభ్యులు వీరంగారి రమేష్‌రెడ్డి, నాగరాజు నాయుడు, ఓంకార్ భరత్ రాజ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గురుమూర్తి రెడ్డి, కార్యదర్శి నరసింహారెడ్డి, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

పాకాల ఎంపీడీవోగా వాసుదేవరావు



పాకాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాకాల ఎంపీడీవోగా ఎస్.వాసుదేవరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లాలో ఏవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రదినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



పాకాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న గోర్పాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనేరి ప్రభును ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్న ఆయనను సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకోట రామమూర్తి, నాయకులు జి.సుధాకర్, యువరాజ్, చంద్రశేఖర్, శ్రీరాములు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదల



రామచంద్రాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మంచి పౌష్టికాహారం పిల్లలకు అందించినపుడే జ్ఞానవంతులై మంచి ఎదుగుదల వస్తుందని ఎస్వీ యూనివర్శిటీ సామాజిక విభాగాధిపతి కుసుమ అన్నారు. రాయలచెరువుపేట అంగన్వాడీ కేంద్రంలో ఎస్వీ యూనివర్శిటీ సామాజిక విభాగం పలు కార్యక్రమాలు చేపట్టింది. ఈ సందర్భంగా కుసుమ మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో పిల్లలు ఎదుగుదల తగ్గిపోతుందన్నారు. మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. మనస్ వికాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటేష్, ముకుందనాయుడు, రమణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా సౌందర్యలహరి పారాయణం



పారాయణంలో పాల్గొన్న భక్తులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట పంచాయతీ ఎల్ఎస్‌నగర్ కాలనీలోని శక్తి చాముండేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం సౌందర్యలహరి పారాయణాన్ని వేడుకగా నిర్వహించారు. స్థానికులు ఎన్వీ శాంతమ్మ, రుక్మిణమ్మల సారథ్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేసి పారాయణం చేశారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఎన్వీ నారాయణ చేతులమీదుగా మహిళా భక్తులకు అమ్మవారి పసుపు, కుంకుమ, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు స్వాతి, నాగలక్ష్మి, సుహాసిని, శైలజ, వాణి, విజయమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


శ్రీచైతన్యలో ఘనంగా హిందీ దివస్



కవుల వేషధారణలో విద్యార్థులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): జీఎస్ మాడ వీధిలోని శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం హిందీభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు కవులు, కవయిత్రుల వేషధారణలతో సందడి చేశారు. ఏజీఎం జి.సురేష్, ప్రిన్సిపాల్ సురేష్, కో-ఆర్డినేటర్ బాలాజి, సీఅండ్ఎం ఇన్‌చార్జి నరేంద్రబాబు, టీచర్లు పాల్గొన్నారు.

డైట్‌లో ముగిసిన కళా ఉత్సవం



బహుమతులు పొందిన విద్యార్థులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో కళా ఉత్సవం శుక్రవారంతో ముగిసింది. 12 విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదరరావు తెలిపారు.

వీఏఎస్‌లు శ్రీవాణి, ప్రతిభ డెప్యుటేషన్ పొడిగింపు

తిరుపతిరూరల్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్సిటీ, ఏపీఎల్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఇద్దరు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ (ఏహెచ్) డాక్టర్ పి.శ్రీవాణి, డాక్టర్ వై.ప్రతిభ డెప్యుటేషన్‌ని ఏడాదికాలం పొడిగిస్తూ పశుసంవర్ధకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి డెప్యుటేషన్ పదవీకాలం ముగియడంతో మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

బీమా మంజూరు.. మృతుడి తల్లి కృతజ్ఞతలు

చంద్రగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరికి చెందిన షేక్ బహీర్ అగరాల సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో చదివే వాడు. ఈ ఏడాది ఏప్రిల్ 28న స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి ప్రమాద వశాత్తు మృతిచెందాడు. కళాశాలలో విద్యార్థులకు ఇన్సూరెన్స్ చేయించారు. దీంతో బీమా సొమ్ము లక్ష రూపాయలు మృతుడి తల్లి షేక్ నూర్జాహన్ ఖాతాలోకి రావడానికి ప్రిన్సిపాల్ భక్తవత్సలం, అధ్యాపకులు కృషిచేశారు. షేక్ నూర్జహాన్ ప్రిన్సిపాల్‌కు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బంగారు తిరుచ్చిపై సిరులతల్లి సాక్షాత్కారం

తిరుచానూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి శుక్రవారం అత్యంత వేడుకగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మూలవర్లకు నేత్రపర్వంగా అభిషేకం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తి వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కన్నులపండువగా జరిగింది. సాయంత్రం సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్ నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠ స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుబాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

డెయిరీటెక్నాలజీ ఏడీగా డాక్టర్ గంగరాజు




తిరుపతిరూరల్, సెప్టెం బరు12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్‌గా లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ జి.గంగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.వినూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఏడీని పలువురు అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. కాగా ఇప్పటివరకు ఏడీగా ఉన్న డాక్టర్ వై.రవీంద్రారెడ్డి పదవీకాలం ముగిసింది. దీంతో ఆయన వెటర్నరీ కళాశాల ఎల్‌పీఎం విభాగ ప్రొఫెసర్‌గా కొనసాగుతారు.

రేపు గవర్నర్ రాక

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం తిరుపతికి రానున్నారు. ఉదయం 9.55 గంటలకు విజయవాడలో బయలుదేరి 11.20 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11.50గంటలకు శ్రీకన్వెన్షన్ హాల్లో జరిగే విట్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు విశ్వనాథం మనవరాలు కాదంబరి విశ్వనాథన్ వివాహానికి హాజరవుతారు. ఆ రోజు రాత్రికి గ్రాండ్‌రిడ్జ్ హోటల్లో బసచేస్తారు. సోమవారం రాహుల్ కన్వెన్షన్‌లో జరుగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు ముగింపు సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం తిరుమల చేరుకుని రాత్రి అక్కడ బస చేస్తారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, సాయంత్రం విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారు.

డాక్టరేట్ ప్రదానం



మాధవరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగ పరిశోధకుడు పి.మాధవరావు డాక్టరేట్ పొందారు. 'యూజ్ ఆఫ్ పీరియాడికల్స్ బై ద ఫ్యాకల్టీ అండ్ రీసెర్చ్ స్కాలర్స్ ఇన్ ఆంధ్ర అండ్ శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ లైబ్రరీస్ ఎ స్టడీ' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ప్రొఫెసర్ కొంగర సురేంద్ర బాబు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఆయన ఇప్పటివరకూ పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. 30 ఏళ్లుగా వేంపల్లె ప్రభుత్వ గ్రంథాలయాధికారిగా సేవలు అందిస్తున్నారు.

రేపు తిరుపతి నగరవనం పుస్తకావిష్కరణ

మంగళం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కపిలతీర్థం వద్దగల దివ్యారామంలో ఆదివారం తిరుపతి నగరవనం పుస్తకాన్ని ఆవిష్కరించ నున్నట్లు రచయిత బీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.15గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అటవీ శాఖ అభివృద్ధి కార్యకలాపాల ఏపీ రాష్ట్ర సలహాదారు మల్లికార్జునరావు, ఏపీ రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, సీపీఎఫ్ సెల్వం, డీఎఫ్‌వో వివేక్, రాష్ట్ర కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు వర్మ వస్తారని తెలిపారు.

పట్టించుకోండి సారూ..!



బ్రిడ్జిపై లైట్లు వెలగక కింద నెలకొన్న అంధకారం

తిరుపతిరూరల్, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): శక్తిచాముండేశ్వరిదేవి ఆలయానికి ఎదురుగా తుమ్మలగుంట నుంచి చంద్రగిరి వైపుకి వెళ్లే మార్గంలో ఐకానిక్ బ్రిడ్జిపై అమర్చిన దీపాలు రెండ్రోజులుగా వెలగడంలేదు. దీంతో బ్రిడ్జికింద ఉన్న రోడ్డు మార్గంలో అంధకారం నెలకొంది. వాహనదారులు, స్థానికులు రాత్రిపూట ఇబ్బంది పడుతున్నారు. రెండ్రోజుల క్రితం బ్రిడ్జికింద కొందరు ఎక్సకవేటర్‌తో చదును పనులు చేపట్టారని ఆ సమయంలో ఎక్సవేటర్ తగిలి విద్యుత్ వైర్లు తెగిపోవడంతో దీపాలు వెలగడంలేదని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి లైట్లు బాగుచేయాలని కోరుతున్నారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై సర్వే చేయలేం



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

భాకరాపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇంటి వద్దనే వాట్సప్ ద్వారా అందించే సేవలపై డోర్ టు డోర్ సర్వే నిర్వహించలేమని సచివాలయ ఉద్యోగులు చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ సతీశ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆదేశాల మేరకు వాట్సప్ సర్వీసును సచివాలయంలోనే ఉంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దాత భానుప్రకాష్‌రెడ్డి, ఎంఈవోలు

చంద్రగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ పూర్వ విద్యార్థి తను చదివిన పాఠశాల కోసం రూ.5.5 లక్షలు వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. చంద్రగిరి మండలంలోని దోర్నకంబాల ప్రాథమికోన్నత పాఠశాలలో బైరెడ్డి భానుప్రకాష్ చదువుకుని ఉన్నత స్థానంలో ఉన్నారు. ఈ క్రమంలో చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఆ పాఠశాలకు 10 కంప్యూటర్లు, 10 కంప్యూటర్ టేబుల్స్, 10 కుర్చీలు, 25 డెస్కులు వితరణ చేశారు. పాఠశాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. క్రీడా మైదానం చదును చేయించారు. వంట గదిని ఆధునీకరణ చేయించారు. ఈ క్రమంలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ కంప్యూటర్ శిక్షణ కోసం సొంత ఖర్చులతో ట్యూటర్ ఏర్పాటు చేయించి సుమారు 45 మంది విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్‌పై శిక్షణ ఇప్పించారు. శిక్షణ పూర్తి చేసుకొన్న విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలలో ఉత్తీర్ణ సాధించడంతో శుక్రవారం వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్ బాబు, పూర్వ విద్యార్థి, దాత బైరెడ్డి భానుప్రకాష్‌రెడ్డి విచ్చేశారు. ఎంఈవోలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, దాత బైరెడ్డి భాను ప్రకాష్‌ను ఘనంగా సత్కరించారు. హెచ్ఎం జగదీష్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలి



ఊట్లవారిపల్లె పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో బాబ్జీ

పాకాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల్లో మెనూ మేరకు మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈవో బాబ్జీ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని రవణయ్యగారిపల్లె, మొగరాల, కొండేపల్లె, ఉప్పరపల్లె, ఎస్వీఎస్ పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యాబోధనను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల మేరకు వారికి అర్థమయ్యేలా సులభరీతిలో సరళంగా బోధించాలన్నారు. పాఠశాలల్లో మరుగు దొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎంఈవో-2 లింగయ్య ఎమ్మార్సీలో ఉపాధ్యాయులకు అకడమిక్ క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జిలానీ, దయానంద నాయుడు, రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి, రోహిణీకుమారి, సీఆర్పీలు శ్రీనివాసులు, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాకాల పోలీస్ క్వార్టర్స్



పాకాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాకాల పోలీసు క్వార్టర్స్ శిథిలావస్థలో ఉంది. పాకాల న్యూకాలనీలో పోలీసుల కోసం సుమారు అర ఎకరాకు పైగా విస్తీర్ణంలో 1994లో పోలీసు క్వార్టర్స్ నిర్మించి ప్రారంభోత్సవం చేశారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌తో రెండు బ్లాకులు నిర్మించారు. నిర్మాణాల్లో నాణ్యత లేకపోవడంతో నిర్మించిన 20 ఏళ్లకే భవనాలు పాడయ్యాయి. తర్వాత మరమ్మతులు కూడా సకాలంలో చేపట్టకపోవడంతో దుస్థితికి చేరాయి. నివాసయోగ్యంగా లేకపోవడంతో పోలీసు సిబ్బంది అద్దె ఇళ్లలోకి వెళ్లిపోయారు. దీంతో ఈ నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. ముళ్లకంపలు, చెట్లతో ఈ ప్రాంతం అడవిని తలపిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మించాలని ఖాకీలు కోరుతున్నారు.

ఇద్దరు వాహన దొంగల అరెస్టు

3.50 లక్షల విలువైన ఏడు వాహనాల స్వాధీనం



నిందితులను మీడియాకు చూపిస్తున్న సీఐలు మహేశ్వర, నెట్టికంఠయ్య తదితరులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను చోరీ చేసే ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి 3.50 లక్షల విలువైన ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను శుక్రవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నెట్టికంఠయ్య ఒకటో పట్టణ సీఐ మహేశ్వర, ఎస్ఐ రమేష్‌బాబుతో కలిసి మీడియాకు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు చిత్తూరు నగరంతోపాటు వివిధ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు చోరీ కావడంపై బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దొంగలను పట్టుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఈ క్రమంలో ఒకటి, రెండో పట్టణ పోలీసుస్టేషన్ల సిబ్బంది వేలూరు రోడ్డులోని డీఆర్‌డీఏ ఆఫీస్ ఎదురుగా వాహన తనిఖీలు చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా తోటపాళ్యం పాలేటమ్మ కోవెల స్ట్రీట్‌కు చెందిన ఏసుదాస్(26), సత్తువాచ్చారి వీవోసీ నగర్‌కు చెందిన లోకనాథన్(18)లను అనుమానంతో పట్టుకోగా మరో నిందితుడు సయ్యద్ నస్రుల్లా తప్పించుకున్నాడు. అదుపులోకి తీసుకున్న వారిని విచారించగా.. చిత్తూరుతోపాటు తమిళనాడు రాష్ట్రంలోనూ చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 3.50 లక్షల విలువైన ఏడు వివిధ రకాల ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సిబ్బందిని సీఐలు అభినందించారు.

నేతిగుట్లపల్లె వద్ద పట్టుబడ్డ ఎర్రచందనం

దుంగలు సహా వాహనాన్ని వదిలి పారిపోయిన స్మగ్లర్లు ● ఒకరిని పట్టుకున్న పోలీసులు



పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో వున్న ఎర్రచందనం తరలించిన కారు

పుంగనూరు, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్టానికి ఎర్రచందనం తీసుకెళుతూ మార్గమధ్యంలో మొరా యించిన కారును పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు.అన్నమయ్య జిల్లా రాజంపేట, రాయచోటి ప్రాంతం నుంచి గురువారం రాత్రి ముగ్గురు స్మగ్లర్లు ఇన్నోవా కారులో రాయచోటి, మదనపల్లె,పుంగనూరు మీదుగా కర్ణాటకకు 19 ఎర్రచందనం దుంగలను తరలించడానికి బయల్దేరారు. పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్దకు రాగానే కారు మొరాయించగా నేతిగుట్లపల్లె వైపు కారును మళ్లించారు.అక్కడ పల్లం ఉండడంతో హంద్రీనీవా పంప్ హౌస్ వద్దకు వెళ్లి కారు ఆగింది.దీంతో కారులోని ఎర్రచందనం దుంగలను పక్కనే చెట్లు, పొదల మధ్యలో ఉంచి కారు మెకానిక్ కోసం ఉదయం వరకు వెయిట్ చేశారు.వీరిని గమనించిన రైతులు పుంగనూరు సీఐ సుబ్బరాయుడికి సమాచారమిచ్చారు. పోలీసులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకోగా గమనించిన దుండగులు నేతిగుట్లపల్లె రిజర్వాయర్ వైపు పరారయ్యారు. పోలీసులు వెంబడించి వారిలో హోసూరుకు చెందిన సర్దార్‌బాషా(45)ను అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. దీంతో దాచిన ఎర్రచందనం దుంగలను, కారును పోలీసులు సీజ్ చేశారు. పరారైన వారు ఎవరు, ఎక్కడినుంచి ఎర్రచందనం ఎక్కడికి తరలిస్తున్నారు అనే సమాచారం కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అండర్-14, 17 బాలబాలికల క్రీడా పోటీలు

భాకరాపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 16, 17 తేదీలలో అండర్-14, 17 బాలబాలికల మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. 16న ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, యోగా, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు, 17న అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తమ పాఠశాలలకు చెందిన క్రీడాకారులను తీసుకురావాలన్నారు. ఇక్కడ విజేతలైన వారు జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. క్రీడాకారులు తమ ఆటలకు సంబంధించిన సామగ్రిని తెచ్చుకోవాలని తెలిపారు. అండర్-14కు 2012 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలని, అండర్-17కు 2009 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలన్నారు. వివరాలకు చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ మహేశ్‌ను 9440183919 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎర్రచందనం స్వాధీనం స్మగ్లర్ల పరార్

ఎర్రావారిపాళెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కారుతో సహా ఎర్రచందనం దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ కథనం మేరకు.. మండలంలోని చింతగుంట పంచాయతీ పసుపులేటి వారిపల్లె సమీపంలోని మామిడి తోపు నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందని రహస్య సమాచారం అందింది. గురువారం రాత్రి మామిడి తోపు వద్ద కాపుకాసారు. స్మగ్లరు కారులోకి ఎర్రచందనం దుంగలు నింపుతుండగా దాడి చేశారు. స్మగ్లర్లు పారిపోయారు. కారుతో పాటు అందులోని 7 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5 లక్షలు ఉంటుంది. ఈ దాడిలో సల్లావుద్దిన్, ప్రదీప్, రాజేష్, సదాశివయ్య, శంకర తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద మృతురాలి బంధువుల ఆందోళన

తిరుచానూరు, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట-తిరుపతి రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఓ మహిళ మృతిచెందింది. దీంతో ఆమె కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. కడప జిల్లాకు చెందిన జయలక్ష్మి(51) గర్భసంచి సమస్యతో ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం చేరారు. శస్త్రచికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో రాత్రి చనిపోయింది. అయితే బంధువులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందినట్లు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. డాక్టర్లు, నిర్వాహకులపై దాడికి యత్నించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని బాధితులకు నచ్చజెప్పడంతో వారు శాంతించారు.

ద్రావిడ వర్శిటీ అభివృద్ధికి సీఎం విశేష కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గుడుపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు విశేష కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ద్రావిడ వర్సిటీలోని హరప్ప భవనంలోకి మార్చిన ఇంజనీరింగ్ తరగతులను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి ఇచ్చిన హామీ మేరకు ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసి రెండు కోర్సులను(సీఎస్సీ 60సీట్లు , ఏఐ ఎంఎల్ 60సీట్లు) ప్రారంభించడం జరిగిందన్నారు. వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు ఉంటాయని.. బోధన, బోధనేతర సిబ్బంది కలిసి పనిచేసి వర్సిటీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం మాట్లాడుతూ కుప్పం ప్రాంతాన్ని సీఎం చంద్రబాబు నాయుడు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో విద్యాకేంద్రంగా మారిందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు బాగా చదివి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కుప్పం, పలమనేరు, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ ద్రావిడ విశ్వవిద్యాలయ అధికారులు ఆశయ సాధనకు, భాష పరిరక్షణ కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబరు వైద్యం శాంతారామ్, ఏపీవీఐడీ చైర్మన్ రాజశేఖర్, ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, డీన్ శ్యామల, రెస్కో చైర్మన్ ప్రతాప్, ఏఎంసీ చైర్మన్ మునిరాజు, కుప్పం జనసేన సమన్వయ కర్త నరేష్, నాయకులు డాక్టర్ వెంకటేష్, బాబునాయుడు, తులసీనాథ్, అమీర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాకూ ప్రొసీడింగ్స్ ఇవ్వండి ప్లీజ్!


రికార్డ్సును పరిశీలిస్తున్న వీఆర్వో ప్రసాద్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమకూ ప్రొసీడింగ్స్ ఇచ్చి న్యాయం చేయాలంటూ శెట్టిపల్లె గ్రామానికి చెందిన కొందరు మహిళలు శుక్రవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. శెట్టిపల్లె గ్రామ లెక్క దాఖల సర్వే నంబర్ 410/4లో చెరువుకాలువ పోరంబోకు స్థలాలను 13మంది కొనుగోలు చేశారు. ప్రస్తుతం శెట్టిపల్లె భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధితులకు ఫ్లాట్స్ కేటాయింపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో ఇప్పటికే ప్రొసీడింగ్స్ అందించిన వారికి తొలి ప్రాధాన్యత ఇస్తుండటంతో ఆ 13మంది తమకూ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని గత సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతులు సమర్పించారు. స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ వారివద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి నివేదిక అందించాలని అర్బన్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో శెట్టిపల్లె వీఆర్వో ప్రసాద్ 13మంది మహిళలను పిలిపించి వారి వద్ద ఉన్న రికార్డ్సును క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలోనే పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు.

ఘనంగా ప్రథమ చికిత్స దినోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ జనార్దనరాజు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సెట్విన్ ఆధ్వర్యంలో ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో శుక్రవారం ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్వీ మెడికల్ కాలేజీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ బి.జనార్దనరాజు ప్రథమ చికిత్స ప్రాధాన్యతను వివరించారు. సీనియర్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ రత్నశేఖర్ ప్రథమ చికిత్స పద్ధతులపై శిక్షణఇచ్చారు.అత్యవసరపరిస్థితుల్లో అనుసరించాల్సిన చర్యలను వివరించారు. సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ మాట్లాడుతూ ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించడంలో విద్యార్థులు ముందుండాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి, రాజమోహన్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్పీకి కృతజ్ఞతలు



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వినాయకచవితి వేడుకలు, నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించడంలో విశేష కృషి చేసిన ఎస్పీ హర్షవర్ధన రాజును నిమజ్జన కమిటీ సభ్యులు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఇంతటి ప్రశాంతంగా ఎప్పుడూ జరగలేదని, ఇందులో పోలీసుశాఖ కృషి ప్రశంసనీయమని అన్నారు. కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, సభ్యులు నవీన్‌కుమార్ రెడ్డి, వెంకటేష్, కరాటే శ్రీనివాస్, వరప్రసాద్, గుండాల గోపినాథ్, నవీన్, గోపి ప్రసాద్, మణికంట వాసు, దీపక్ యాదవ్ పాల్గొన్నారు.

బంగారు చైను చోరీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మహిళ మెడ నుంచి బంగారు చైను లాక్కెళ్లిన ఘటన గోవిందనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. గోవిందనగర్‌కు చెందిన రంగమ్మ మధ్యాహ్నం ఇంటి ముందు నిలబడి ఉండగా ఇద్దరు యువకులు మాస్కులు వేసుకుని బైక్‌లో వచ్చి ఆమె మెడలోని చైను లాక్కొని పారిపోయారు. 30 గ్రాముల బంగారు చైను అపహరణకు గురైనట్లు బాధితురాలు అలిపిరి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లోకేష్‌బాబు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నారు.

చేనేత, హస్తకళ మేళాను ఆదరించండి


చేనేత, హస్తకళ మేళాను ప్రారంభిస్తున్న ఖాదర్‌వలి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఖాదీకాలనీలోని శివశక్తి కల్యాణ మండపంలో సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళ మేళాను శుక్రవారం సాయంత్రం శిల్పారామం మాజీ ఏవో ఖాదర్‌వలి ప్రారంభించారు. స్టాల్స్‌ను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీ కార్యదర్శి మహేష్ ఫైడి మాట్లాడుతూ 18రోజులపాటు ఈ మినీమేళా కొనసాగుతుందని,రాష్ట్రవ్యాప్తంగా 35మందినేతన్నలు తమఉత్పత్తులను ప్రదర్శించనున్నారని వెల్లడించారు. జైపూర్ బెడ్‌షీట్స్, యూపీ కలప గృహాలంకరణ వస్తువులు, కలంకారి చీరలు, మీరట్ చెప్పులు, కొండపల్లి బొమ్మలు, టవల్స్, కాటన్ షర్ట్స్, ఖాదీటాప్స్, హైదరాబాదు చీరలు, డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుర్గంధం నడుమ చదువులు

పాఠశాల బయట మురుగు.. లోపల వృథా నీరు




విష్ణు నివాసం ప్రహరీ పక్కనే మురుగు - తరగతి గది ముందే వృథా నీటి నిల్వ

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విష్ణు నివాసం, టీపీ ఏరియా మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల మధ్యలో, రోడ్డుపై మురుగు స్తంభించింది. మరో వైపు పాఠశాల ఆవరణలో వృథా నీరు నిల్వ ఉంటోంది. రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తిచెంది దాడి చేస్తున్నాయి. నీటిపైనే విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండటంతో తరగతి గదులు కూడా అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఈ క్రమంలో విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేక పోతున్నారు. నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పాఠశాలలో ఇలాంటి వాతావరణం ఉండటంపై పిల్లల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, గురువారం అదే పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఈ మురుగును పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పారిశుధ్య విభాగ అధికారులను ఆదేశించారు. పాఠశాల గేటు వద్ద కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లను తొలగించాలని హెచ్ఎం మురుగన్ ఎమ్మెల్యేకు విన్నవించారు.


కాలువలో మురుగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

ఆలయ వ్యవహారాల్లో రాజకీయాలొద్దు

గంగమ్మ ఆలయ నూతన కమిటీకి ఎమ్మెల్యే దిశానిర్దేశం


గంగమ్మ ఆలయ నూతన కమిటీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆలయ వ్యవహారాల్లో రాజకీయాలు వద్దని, భక్తులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ నూతన కమిటీకి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో చైర్మన్ మహేష్‌యాదవ్, పదిమంది సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువకప్పి సన్మానించారు. ఎమ్మెల్యే నూతన చైర్మన్, సభ్యులను సత్కరించారు. కలసికట్టుగా గుడిని అభివృద్ధి చేస్తూ, భక్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. బేషజాలకు పోవద్దని, కూటమి పార్టీల్లో కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

గంగమ్మ ఆలయ కమిటీలో రజకులకు అన్యాయం

టీడీపీ రజక సంఘ నేతలు



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రజక సంఘ నాయకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలిలో రజకులకు స్థానం కల్పించకపోవడం అన్యాయమని టీడీపీ రజక సంఘ నాయకులు పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ గంగమ్మ ఆలయ పాలకవర్గంలో వల్లంకుంట అశోక్‌కు అవకాశం కల్పించాలని రజక సంఘం తీర్మానించి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ద్వారా నుంచి నాయకులందరికీ విన్నవించినా అన్యాయం చేశారని తెలిపారు. తిరుపతిలో 15వేల ఓట్లున్న తమ సామాజిక వర్గాన్ని దూరం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని తెలిపారు. అలాగే శనివారం గంగమ్మ ఆలయం వద్ద నిరసన తెలపనున్నట్లు ప్రకటించారు.

వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జయచంద్రారెడ్డి



తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. పార్టీ నాయకులు, మిత్రులు కలిసి అభినందించారు.

నేడు 'ఉగ్గుపాల నుండే..' పుస్తకావిష్కరణ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం పేరూరు బాలసుబ్రమణ్యం రాసిన 'ఉగ్గుపాల నుండే..' కవితల సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీ మిత్రులు, భాషాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

టూరిజంలో నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పించండి


మంత్రిని కలిసిన బుజ్జిబాబు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టూరిజం శాఖలో నాయీబ్రాహ్మణులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని జనసేన నేత, నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవులపాటి బుజ్జిబాబు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. శుక్రవారం గ్రాండ్‌రిడ్జ్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి తిరుపతి కోటాలో తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం శాలువకప్పి సన్మానించారు.

మంత్రికి కిరణ్‌రాయల్ అభినందన


మంత్రి కందుల దుర్గేష్‌ను సన్మానిస్తున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను జనసేన నేత కిరణరాయల్ అభినందించారు. శుక్రవారం హోటల్ గ్రాండ్‌రిడ్జ్ ప్రాంగణంలో మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానిం చారు. జిల్లాకు పరిశ్రమలు తీసుకురావడంలో మంత్రి చేస్తున్న కృషిని కొనియాడారు. మంత్రి మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ జనసేనాని పవన్‌కల్యాణ్ అండగా ఉంటారని హామీ ఇచ్చారు.

ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక


క్యాంపునకు హాజరైన విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జనవరి 26 న చేపట్టే పరేడ్ కోసం ప్రీ-రిపబ్లిక్ పరేడ్ క్యాంపునకు విద్యార్థినుల ఎంపిక ప్రక్రియ పద్మావతి వర్సిటీలో శుక్రవారం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ హైదరాబాదు ప్రాంతీయ అధికారి రామకృష్ణ, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఎన్ఎస్ఎస్ అధికారి సుధాకర్ పర్యవేక్షించారు. 60 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ హెడ్ శారా సరోజిని పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషిచేద్దాం

మహేష్ యాదవ్‌ను సన్మానించిన టీడీపీ నేతలు


మహేష్ యాదవ్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి) : తాతయ్యగుంట గంగమ్మ ఆలయాభివృద్ధికి కృషి చేయాలని నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న మహేష్ యాదవ్‌కు పలువురు టీడీపీ నేతలు సూచించారు. ఆలయ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా శుక్రవారం నగరంలోని టీడీపీ ప్రముఖులను మహేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణను సత్కరించి, ఆలయాభివృద్ధికి సహకరించాలని కోరారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని, టీఎంఆర్ కూడలి వద్ద ఆగిపోయిన ఆర్చి నిర్మాణంపై టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ వద్ద ప్రస్తావించానన్నారు. 35, 26, 27, 32 డివిజన్ అధ్యక్షులు, నాయకులు, యూనిట్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు కలిసి మహేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎం శ్రీధర్, తిరుత్తణి వేణుగోపాల్, రవితేజ నాయుడు, దేవాచారి, నాగప్రతాప్ చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మి, షైనం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవలు మరువం

వ్యవస్థాపక దినోత్సవంలో ఎస్వీయూ ఉన్నతాధికారులు


కార్యక్రమంలో పాల్గొన్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ అభివృద్ధికి రిటైర్డు ఉద్యోగులు చేసిన సేవలు మరువలేనివని ఎస్వీయూ వీసీ అప్పారావు పేర్కొన్నారు. రిటైర్డు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం సెనేట్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. రిటైరై 15 ఏళ్లు పూర్తి చేసుకున్న 35 మంది ఉద్యోగులను సన్మానించారు. వీసీ అప్పారావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు యూనివర్సిటీకి చేసిన సేవలను కొనియాడారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగుల అనుభవాలు ఈతరం ఉద్యోగులకు అవసరమన్నారు. ఎస్బీఐ చీఫ్ మేనేజర్ దేవేంద్రనాథ్ మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి తమ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, రిటైర్డు నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యంరెడ్డి, విజయకుమార్, రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

కళలను భావితరాలకు అందించాలి

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్



ఉమా ముద్దుబాల దంపతులను సన్మానిస్తున్న నరసింహయాదవ్, మునికృష్ణ, రంగస్థలి నిర్వాహకులు - బహుమతులు అందుకున్న కళాకారులతో నవీన్‌కుమార్‌రెడ్డి, రంగస్థలి సంస్థ ప్రతినిధులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలోని కళాక్షేత్రంలో రాయలసీమ రంగస్థలి 35వ వార్షిక నృత్య కళోత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముబ్బు దేవనారాయణరెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్ మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ రంగస్థలి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. అనంతరం టీటీడీ మ్యూజిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాలకు నాట్య విద్వన్మణి అవార్డును ప్రదానం చేసి ఆ దంపతులను ఘనంగా సత్కరించారు. రాజోలుకు చెందిన ప్రముఖ భాషా పండితులు దేవరకొండ శ్రీనివాస వెంకటరమణారావుకు కవన గీష్పతి, నెల్లూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్‌కు నాట్య భూషణ్ అవార్డులను ప్రదానం చేశారు. తర్వాత నృత్య ప్రదర్శనలిచ్చిన కళాకారులు, చిన్నారులను బహుమతులు, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. అంతకు ముందు ఉదయం బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్వీడబ్ల్యూ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, మాజీ కౌన్సిలర్ రేవంత్‌కుమార్, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి కెఎన్.రాజా తదితరులు పాల్గొన్నారు.







సత్యపాల్ సింగ్ బాగల్ - జస్టిస్ అవినాష్ జింగన్ - అనిరూధ్ - సప్తగిరి - సుధా

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో కేంద్రమంత్రి సత్యపాల్‌సింగ్ బాగల్, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అవినాష్ జింగన్, రాజస్థాన్ మంత్రి కన్హయ్య లాల్ చౌదరి, జార్ఖండ్ మాజీ సీఎం సర్యురాయ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఉన్నారు. ఇంకా సంగీత దర్శకుడు అనిరుధ్, నటి సుధా, నటుడు సప్తగిరి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

17న తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో ఈ నెల 17న అండర్ 14, 17, 19 బాలబాలికల తైక్వాండో, స్విమ్మింగ్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న వారు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని కోరారు. హెచ్ఎం నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టుతో రావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 8121777077(స్విమ్మింగ్), 9032956111 (తైక్వాండో)లను సంప్రదించాలని కోరారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణ తేజ విశ్రాంతి భవనం మీదుగా శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.81 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,312

తలనీలాలు సమర్పించినవారు: 27,728

గుడి తాళాలకీ, బండి తాళాలకీ

తేడా తెలీదా భూమనా?

● టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి



భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): 'ఏందయ్యా కరుణాకర్‌రెడ్డి గారు.. గతంలో రెండు సార్లు టీటీడీ చైర్మన్‌గా పనిచేశారు. మూడుసార్లు సభ్యుడిగా ఉన్నారు. బండి తాళాలకు, గుడి తాళాలకు తేడా కూడా తెలియదా మీకు?' అంటూ టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుమల శ్రీవారి ఆలయం ముం దు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, చంద్ర గ్రహణం రోజున మహద్వారం గేట్‌కు టీటీడీ సిబ్బంది తాళాలు వేస్తే చైర్మన్ సైన్యం చేతిలో తాళాలున్నాయని అబద్ధాలు ప్రచారం చేశారని చెప్పారు.టీవీ5 రిపోర్టర్ బండి తాళాలు పట్టుకుని మహద్వారం వద్ద ఫొటో దిగితే మహద్వారం గేటు తాళాలని అబద్ధాలు ప్రచారం చేశారు. మరి సాక్షి రిపోర్టరు కూడా అలానే ఫొటో దిగారు అది కనిపించలేదా కరుణాకర్‌రెడ్డీ అని నిలదీశారు. టీటీడీపై అసత్య, అబద్ధపు ప్రచారాలు చేసినా, ఫేక్ న్యూస్‌లు వేసినా క్రిమినల్ కేసులు పెట్టేలా రానున్న బోర్డు సమావేశంలో తీర్మానం చేస్తామని భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు.

తిరుమలలో దొంగ దొరికాడు

● 15 సెల్‌ఫోన్లు, 20 గ్రాముల బంగారు స్వాధీనం



పోలీసుల అదుపులో కిషోర్‌రెడ్డి, స్వాధీనపరుచుకున్న బంగారు, సెల్‌ఫోన్లు

తిరుమల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భక్తుల నుంచి సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు కొట్టేసే దొంగను తిరుమల పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 15 సెల్ ఫోన్లు, 20గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీన పరుచుకున్నారు. తెలంగాణలోని నల్గొండ జిల్లా, పాత సూర్యాపేటకు చెందిన మెట్టు కిషోర్‌రెడ్డి కొంతకాలంగా తిరుమలను కేంద్రం చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇతను గత నెలలో సీ టైప్ కార్వర్స్‌లోనూ ఇంటి తాళాలు పగలగొట్టి 20 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.40 వేల నగదు అపహరించినట్టు విచారణలో వెల్లడైంది. కిషోర్‌రెడిని జ్యుడీషియల్ రిమాండ్ కోసం తిరుపతికి పంపారు.

ఇసుక అక్రమ రవాణాకు మైనర్లు

● పట్టించుకోని అధికారులు

రేణిగుంట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని స్వర్ణముఖి నది తీర ప్రాంతం నుంచి ఇసుకను యథేచ్ఛగా దోచుకోవడమే కాకుండా మైనర్లని ట్రాక్టర్ డ్రైవర్లుగా వినియోగించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. స్వర్ణముఖి నది తీర ప్రాంతంలోని జీపాళెం, పిల్లపాళెం, తాతయ్యకాలవ, గాజుల మండ్యం, పన్నీరుకాలువ, కొత్ర మంగళం పరిసరాల్లో స్వర్ణముఖి నది తీరంతో పాటు, ప్రైవేటు భూముల్లో ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల పోటీతత్వంతో అధిక మొత్తంలో ఇసుకను రవాణా చేయాలని దురుద్దేశంతో కొంతమంది ఇసుకాసురులు ఏకంగా మైనర్లను కనీసం లైసెన్స్ లేకుండా ఇసుక అక్రమ రవాణాకు డ్రైవర్లుగా వినియోగిస్తున్నారు. రోడ్లపై జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి బాలురతో ఇసుక రవాణా చేస్తున్న ఇసకాసురులపై చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ విషయంపై డీఎస్పీ శ్రీనివాసరావుని వివరణ కోరగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మైనర్లతో ఇసుక ట్రాక్టర్లను తోలిస్తే ఎక్కడికక్కడ వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఎంత కాలం విచారిస్తారో!



కాల్వ వంకలో నిర్మించిన రేకుల షెడ్డు, రూమ్..

రేణిగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. ఇదీ ఆక్రమణలపై రెవెన్యూ అధికారుల స్టాక్ డైలాగ్. ఎంతకాలం విచారిస్తారో కానీ.. ఆ ఆక్రమణ స్థలాల్లో నిర్మాణాలూ జరిగిపోతుంటాయి. ఇలాంటిదే రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ నీలసానిపేటలో చోటుచేసుకుంది. ఇక్కడి సర్వేనెం.1147లో కాలువ వంక 2.84ఎకరాల్లో విస్తీర్ణంలో ఉంది. గతంలో ఈ కాల్వ వంకలో సేద్యం చేస్తుండే వారు. ఆ తర్వాత రాత్రికి రాత్రే ఆ భూమిలో షెడ్ వెలిసింది. ఇందులో నిర్మాణాలు చేపడుతున్నట్లు ఇటీవల జరిగిన మండల సర్వసభ సమావేశంలో ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకుంటామని ఆ సమావేశంలో రెవెన్యూ అధికారే చెప్పారు. కానీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత ఆక్రమణదారులు ఇళ్ల నిర్మాణానికి గుంతలు తవ్వారు. ఇలా చూస్తుండగానే ఇంటి నిర్మాణమూ పూర్తయ్యేలా ఉందే కానీ.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.



పక్కనే ఇంటి నిర్మాణానికి తవ్విన గుంతలు

స్కిట్‌లో తరగతుల ప్రారంభానికి సన్నద్ధం



స్కిట్ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, వైస్ ఛాన్సలర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూతో అనుబంధంగా స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో తరగతులు త్వరలో ప్రారంభించడానికి సర్వం సన్నద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్, అనంతపురం జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు సంయుక్తంగా తెలిపారు. నాలుగేళ్ల క్రితం మూతపడిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను తెరిపిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా గత నెలలో ఆ ప్రక్రియ పూర్తి చేసిన విషయం తెలిసిందే. రెండో విడత ఏఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా స్కిట్ కళాశాలలో అడ్మిషన్ల కోసం వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. అలాగే మూడో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా మళ్లీ ఇదే కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించారు. శుక్రవారం ఎమ్మెల్యే, జేఎన్‌టీయూ వీసీ కళాశాలను సంయుక్తంగా పరిశీలించారు. మొదటి సంవత్సరం నిర్వహణ కోసం యుద్ధప్రాదికన సిద్ధం చేస్తున్న తరగతి గదులు, డిజిటల్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. ముక్కంటి ఆలయం సహాయంతో విద్యార్థులకు వసతి సదుపాయం కల్పిస్తున్న అంశంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ ముగిసిన వెంటనే తరగతి గదులు ప్రారంభమవుతాయన్నారు. స్థానిక విద్యార్థులు మూడో విడత కౌన్సిలింగ్‌లో అడ్మిషన్లు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, మోహీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బాఘేల్



శ్రీజ డెయిరీని పరిశీలిస్తున్న మంత్రి ఎస్పీ సింగ్ బాఘేల్

చంద్రగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లబ్ధికోసం మహిళలు పాల ఉత్పత్తి మాత్రమే కాకుండా కోళ్ల పెంపకం, చేపల సాగు, పందుల పెంపకం వంటి రంగాలలోనూ రాణించాలని కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ భాఘేల్ సూచించారు. చంద్రగిరి మండలం మల్లయ్యపల్లెలోని శ్రీజ డెయిరీ మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన శ్రీజలో సంస్థలో ఉన్న మహిళా పాడి ఉత్పత్తిదారులతో సంభాషించారు. సంస్థ నిర్వహణ విధివిధానాలను పరిశీలించారు. పాల ఉత్పత్తిదారులతో శ్రీజ సంస్థ అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్, డెయిరీ సర్వీసెస్ శ్రీజ సంస్థకు అందిస్తున్న సహకారాన్ని అడిగి తెలుసుకున్నారు. దేశంలోనే డెయిరీ రంగ అభివృద్ధిలో శ్రీజ సంస్థ భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. పంచాయితీ రాజ్ వ్యవస్థల ద్వారా అనేక గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల చురుకైన పాత్ర పోషించాలని తెలియజేశారు. అనంతరం మహిళా పాల ఉత్పత్తిదారులను లాఖ్‌పతి దిదీస్‌లను ఎంపిక చేసి మంత్రి ఘనంగా సత్కరించారు. తర్వాత మల్లయ్యపల్లె టీడీపీ నాయకుడు బీగాల మహేష్ రాయల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేంద్రమంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీజ కంపెనీ సీఈఓ తిమ్మప్ప, హెడ్ రాజేంద్రబాబు, పీబీబీ హెడ్ నిశాంత్, తిరుపతి ఏరియా మేనేజర్ రమేష్, పీబీబీ మోహన్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్ డైలాగ్స్'లో ఆంధ్రజ్యోతి కథనం

తిరుపతి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించి జాతీయస్థాయిలో విశ్వసనీయత కలిగిన 'మెడికల్ డైలాగ్స్' వెబ్ న్యూస్‌లో నిబంధనలు పాటించని స్విమ్స్ నోటిఫికేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ శుక్రవారం ఓ కథనం రాసుకొచ్చింది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'చదువు చెప్పిన చోటే వద్దంటోంది' శీర్షిన ప్రచురితమైన వార్తను ఉటంకించింది. అదేవిధంగా డెంటిస్ట్రీ పోస్టును మార్చిన తీరును ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అంశాన్నీ ప్రస్తావించింది. మెడికల్ డైలాగ్స్ నుంచి వార్తాంశాలను వైద్య, ఆరోగ్య రంగం కీలకంగా పరిగణిస్తుంటోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) కూడా సదరు వెబ్‌సైట్‌లోని అంశాలను అనుసరిస్తుంటోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. స్విమ్స్ నోటిఫికేషన్ లోపాలను స్థానిక మీడియా కథనాలు ప్రచురిస్తోందని మెడికల్ డైలాగ్స్ తన కథనంలో పేర్కొంది. వైద్య అభ్యర్థులు సదరు వెబ్ లింక్‌ను వైరల్ చేస్తే తమ వెతలను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు చెబుతున్నారు.

తల్లీ కూతుళ్ల కిడ్నాప్

● నిందితులపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇక, వివాహేతర సంబంధం మానేద్దామన్న వివాహితను బెదిరించాడు. ఆమెను, ఆమె తల్లిని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కిడ్నాప్, హత్యాయత్నం కింద ఈస్ట్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తిరుపతికి చెందిన ఓ వివాహిత ఇంటి వద్ద టైలరింగ్ పనులు చేస్తోంది. ఈమె భర్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈ క్రమంలో కొర్లగుంటలోని అజీమ్‌తో ఈమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం ఎక్కడ ఇంట్లో తెలిసిపోతేందనే ఆలోచనతో ఆమె సంబంధం తెంచుకోవాలని అజీమ్‌కు చెప్పింది. దీనికి అతడు అంగీకరించలేదు. ఈ క్రమంలో లక్ష్మీపురం సర్కిల్‌లోని జిమ్ వద్దకు రావాలని ఆ మహిళ, ఆమె తల్లికి ఫోను చేశాడు. డ్రైవర్ బబ్లూతో కలిసి వారిని బలవంతంగా కారులో తీసుకెళ్లాడు. తన ప్రేమ కాదంటే ఇద్దరినీ చంపి తగుల బెడతానని బెదిరించి దాడి చేశాడు. దీనిపై బాధితులు 112కు ఫోన్ చేసి తమను కిడ్నాపర్ల బారి నుంచి కాపాడాలని పోలీసులను వేడుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలసి ఘటనా స్థలికి చేరుకుని వారి ఆచూకీ కోసం గాలించారు. అజీమ్ వాడుతున్న మొబైల్ నెంబరు ఆధారంగా వారిని గుర్తించి లక్ష్మీపురం సర్కిల్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన చెప్పారు.

యాంకర్ హబ్‌గా తిరుపతి

జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దుతాం

ప్రాంతీయ పెట్టుబడిదారుల సమావేశంలో మంత్రి దుర్గేష్



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'పెట్టుబడులతో రండి. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేద్దాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిద్దాం' అంటూ ఇన్వెస్టర్లకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ, తిరుపతిల్లో పర్యాటకరంగ అభివృద్ధికి సంబంధించి ప్రణాళికను వివరించారు. తిరుపతిని మైస్ టూరిజం సెంటర్‌గా, ఓ యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే భక్తులు రెండు మూడు రోజులు ఇక్కడే ఉండి ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. దీనికోసం చంద్రగిరి కోట, ఎస్వీ జూపార్కు, తలకోన, సూళ్లూరుపేట, నేలపట్టులోని పక్షుల విహార కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో పర్యాటకుల వసతికి అవసరమైన స్టార్ హోటళ్లు, రిసార్టులు, కాటేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అంచనా మేరకు క్యారవాన్ టూరిజంకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. శేషాచలం అడవుల్లో అడ్వెంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ ట్రెక్కింగ్ తదితర ప్రక్రియను ప్రవేశపెడితే బాగుంటుందని ఆలోచిస్తున్నట్టు చెప్పారు. ఎర్రచందనం లభిస్తున్న ఈ ప్రాంతంలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. తిరుపతి ప్రాంతంలో అటవీ, దేవదాయ, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎకో టూరిజం అభివృద్ధికి ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కోనసీమలోని మండువాల తరహాలో తిరుపతిలో పాతకాలం నాటి ఇళ్లలో, పురాతన కట్టడాలలో హోమ్‌స్టేలు ఏర్పాటు చేస్తామన్నారు. స్పష్టమైన ప్రతిపాదనలతో, ఆలోచనతో పర్యాటక అభివృద్ధికి ముందుకొచ్చే ఇన్వెస్టర్లకు ప్రభుత్వం అవసరమైన భూమి, రాయితీలు, ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు త్వరితగతిన జారీ చేస్తామన్నారు. ఇన్వెస్టర్లపై భారం పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. హోమ్‌స్టేలు, పర్యాటక పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలను ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి వివరించారు. పెట్టుబడిదారులకు ఏ ఇబ్బంది వచ్చినా తాను పరిష్కరిస్తానని, అనుమతుల మంజూరు తదితరాల విషయంలో అండగా ఉంటానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, కలెక్టర్ వెంకటేశ్వర్, నరసింహ యాదవ్, సుగుణమ్మ, పసుపులేటి హరిప్రసాద్, టూర్ ఆపరేటర్స్ అసోయేషన్ అధ్యక్షుడు విజయ్ మోహన్, సీఐఐ దామోదర నాయుడు, ఔత్సాహిక ఇన్వెస్టర్లు పాల్గొన్నారు.

తిరుపతిని వ్యూహాత్మక పర్యాటక ప్రదేశంగా ప్రభుత్వం భావిస్తోంది. తిరుపతి మొదలు సమీప ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటక పెట్టుబడిదారులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. అందులో బాగంగా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ద్వారా రూ3,482 కోట్ల విలువైన హాస్పిటాలిటీ ప్రాజెక్టులకు కేబినెట్‌లో ఆమోదం లభించింది. తద్వారా హోటళ్లలో 2,698 గదుల ఏర్పాటుకు అవకాశం ఉంది. సుమారు 11,645 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

తిరుపతి సమీపంలో అట్మాస్పియర్, నోవాటెల్, మారియట్, ఒబెరాయ్, లెమన్ ట్రీ, మహేంద్ర తదితర సంస్థలతో రిసార్ట్స్, హోటళ్లు నిర్మించేందుకు ఎంవోయూలు చేసుకున్నాం. దుబాయ్ తరహాలో మీటింగ్, ఇన్సెంటివ్ కాన్ఫరెన్సులు, ఎగ్జిబిషన్ (మైస్) టూరిజంను అభివృద్ధి చేస్తాం.

● తహసీల్దారు కార్యాలయంలో

వీరంగం సృష్టించిన వ్యక్తిపై కేసు

రామచంద్రాపురం,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం తహసీల్దారు కార్యాలయంలో వీరంగం సృష్టించి, అధికారులను దుర్భాషలాడిన పురుషోత్తంరెడ్డిపై కేసు నమోదైంది. తహసీల్దారు మధుసూదన్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రెవెన్యూ అధికారుల కథనం మేరకు .. తన భార్య ఆధార్ కార్డులో అడ్రసు మార్పు కోసం వేపకుప్పం గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి ఆధార్ అప్లికేషన్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం కోసం ఈనెల 6న తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. తహసీల్దారు తన చాంబర్‌లో ప్రజా సమస్యలపై ఫిర్యాదు స్వీకరిస్తుండగా కాసేపు వేచి ఉండాలని పురుషోత్తం రెడ్డికి సిబ్బంది చెప్పారు. తాను ఎందుకు బయట వెయిట్ చేయాలంటూ ఆయన తహసీల్దారు చాంబర్‌లోకి వెళ్లి దరఖాస్తుపై సంతకం పెట్టాలని కోరారు. ఆధార్ కార్డులో తిరుపతి రూరల్ మండలం అని ఉండటంతో అక్కడి తహసీల్దారు చేత సంతకం చేయించుకోవాలని సూచించారు. దీంతో కోపోద్రిక్తుడైన పురుషోత్తంరెడ్డి 'నువ్వు పబ్లిక్ సర్వెంట్. సంతకం ఎందుకు పెట్టవు. మేముచెప్పిన చోట సంతకం పెట్టాలి. నీ కథ చూస్తా. కలెక్టర్‌కు నీపై ఫిర్యాదుచేస్తా' అంటూ దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇంతలో గ్రామ రెవన్యూ అసిస్టెంట్లు మోహన్, గంగయ్య, గీత వారించినా వినలేదు. సిబ్బందిపైనా దుర్భాషలాడారు. దీంతో విధులకు ఆటంకం కలిగించి తమపై దౌర్జన్యానికి పాల్పడ్డాని తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సామాజిక అటవీ విభాగం

డీఎఫ్‌వోగా పవన్‌కుమార్‌రావు

మంగళం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లా సామాజిక అటవీ సామాజిక విభాగం డీఎఫ్‌వోగా జీఎస్ పవన్‌కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు హోదాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా తిరుపతి బయోట్రిమ్‌లో డీఎసీఎఫ్‌గా పనిచేస్తున్న ఆయన డీఎఫ్‌వోగా నియమితులయ్యారు. అలాగే తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా ఉన్న శ్రీనివాసులు సత్యసాయి జిల్లా సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వోగా బదిలీ అయ్యారు. తిరుపతి ఎస్వీ జంతు ప్రదర్శనశాల డీసీఎఫ్‌గా, తిరుపతి సబ్ డీఎఫ్‌వోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నాగభూషణంను మంగళగిరి పీసీసీఎఫ్ కార్యాలయం డీసీఎఫ్‌గా బదిలీ చేశారు.

రూ.69.30లక్షలతో మూడు ల్యాబ్‌లు



ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాల

ఏర్పేడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏర్పేడులోని జడ్పీఉన్నత పాఠశాలలో మూడు ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో ల్యాబ్‌కు రూ.23.10లక్షలు మంజూరయ్యాయి. సైన్స్ ల్యాబ్, రెండు ఆటిజం సెంటర్లు రెండు ఏర్పాటు కానున్నాయి. సైన్స్ ల్యాబ్ ఏర్పాటుతో విద్యార్థులే సైన్స్‌లె మరింత పట్టుసాధించవచ్చు. గత ఐదేళ్లలో ఈ సెంటర్లు కావాలని ఉపాధ్యాయులు పదే పదే జిల్లా స్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపినప్పటికీ గత ప్రభుత్వంలో మంజూరు కాలేదు.

22 నుంచి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 4.30గంటల వరకు ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖమండపం వద్ద పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. అక్టోబరు 2వ తేదీ విజయదశమినాడు రాత్రి 7.45గంటలకు పద్మావతి అమ్మవారు గజవాహనపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. **ఆర్జిత సేవలు రద్దు :** నవరాత్రి ఉత్సవాల కారణంగా ఆలయంలో ఈ పదిరోజుల పాటు కల్యాణోత్సవ సేవను రద్దు చేశారు. అదే విధంగా సెప్టెంబరు 26న లక్ష్మీపూజ సేవలు రద్దు చేశారు.

ఎంత పెద్ద కంటైనర్లో..!



ఒక దాని వెనుక మరొకటి. ఇలా ఐదు భారీ కంటైనర్లు రేణిగుంట మండలం రామకృష్ణాపురం కూడలి సమీపంలో రోడ్డు పక్కన శుక్రవారం ఆపారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రికి గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరికరాలను తరలిస్తున్న ఈ కంటైనర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే నిలిపేశారు. భారీ వాహనాలు కావడంతో పగటిపూట వెళ్తే రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉండడంతో రాత్రి 10 గంటల తర్వాత బయలుదేరాయి.

- రేణిగుంట ఆంధ్రజ్యోతి

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చినుకుపడితే చెరువే!



రామలింగయ్య గిరిజన కాలనీలో చెరువును తలపిస్తున్న వీధి

గూడూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం చెన్నూరు గ్రామంలోని రామలింగయ్య గిరిజన కాలనీలో అంతర్గత రోడ్డు చినుకుపడితే చెరువును తలపిస్తోంది. కాలనీలో సుమారు 200కు పైగా కుటుంబాలు ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే ఓ వీధిలో రోడ్డుపై నీరు చేరి చెరువును తలపించేలా మారుతోంది. దీంతో రాకపోకలు సాగించడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పైప్రాంతంలోని వర్షపునీరంతా వీధిలోకి వచ్చి నిల్వ చేరడంతో పాటు తమ ఇళ్లలోకి వస్తుండడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గురువారం వేకువజామున కురిసిన చిన్నపాటి వర్షానికే వీధి జలమయంగా మారిందని, ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలన్నా పడాల్సివస్తోందనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రామలింగయ్య కాలనీలోని వర్షపునీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగించొద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య

దొరవారిసత్రం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అంతరాయం లేని విద్యుత్ అందించాలని ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య అన్నారు. శుక్రవారం దొరవారిసత్రం 33 కేవీ సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. సబ్ స్టేషన్‌లో సాంకేతిక పరమైన విషయాలపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యుత్ అంతరాయం కలిగే ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కొమ్మల తొలగింపు పేరుతో ప్రతివారం విద్యుత్ సరఫరా ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. లైన్ల కింద చెట్లు లేకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని, సాంకేతికంగా తరచూ మరమ్మతులకు గురయ్యే వాటిని గుర్తించి సరిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాసులు, డీఈలు శేఖర్, వరప్రసాద్, ఏఈలు జగదీష్, మోహిని, మురళి ఉన్నారు.

15నుంచి డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

గూడూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దస్తావేజు రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని సీనియర్ డ్యాకుమెంట్ రైటర్ రాయసం సుబ్బారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డ్యాకుమెంట్ రైటర్ల కార్యాలయం వద్ద డ్యాకుమెంట్ రైటర్ల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 15నుంచి పెన్‌డౌన్ కార్యక్రమం చేపడతామన్నారు. పబ్లిక్ డేటా ఎంట్రీ చేసిన తర్వాత ఏదైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేసుకునే వెసులుబాటు సబ్‌రిజిస్ట్రార్లకు ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడం వల్ల సబ్ రిజిస్ట్రార్‌కు ఎడిటింగ్ చేసే అవకాశం లేకుండా పోయిందన్నారు. రిజిస్ట్రేషన్‌కు ముందు తప్పులు ఉంటే సరిచేసుకునేందుకు వీలులేకపోవడం వల్ల మళ్లీ డేటా ఎంట్రీని మొదటి నుంచి చేయాల్సి ఉంటుందన్నారు. ఇది ఎంతో వ్యవప్రయాసలతో కూడుకున్నదని, డ్యాకుమెంట్ రైటర్లు, వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

17 నుంచి బీజేపీ సేవా పక్షోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురష్కరించకుని ఈనెల 17నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్న సేవా పక్షోత్సవాపై సన్నాహక సమావేశం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తాళ్వాయిపాడులోని పార్టీ కార్యాలయంలో జరిగింది. నరేంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛత అభియాన్, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలను చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్
బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారి జాతర గురువారంతో ముగిసింది. ఉద్యోగాలు, వ్యాపారాలతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ స్థానికులు, బంధువులు జాతర సందర్భంగా వెంకటగిరి వచ్చారు. వారంతా తిరిగి వెళ్లేందుకు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచే ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. అయితే వెంకటగిరి డిపో నుంచి అరకొరగా బస్సులు సర్వీసులు నుడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పైగా మహిళలకు ప్రయాణం కావడంతో బస్సులన్నీ నిండిపోయాయి. దీంతో ప్రయాణికుల మధ్య సీట్ల కోసం వాగ్వావాదం చోటుచేసుకుంది. రాపూరు, తిరుపతి, నాయుడుపేట, గూడూరు, నెల్లూరు మీదుగా వెళ్లాల్సిన బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పంటకాలువలో పైపుల తొలగింపు

గూడూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్‌శాఖ అనుమతులు లేకుండా పంటకాలువలో కొందరు అక్రమంగా ఏర్పాటు చేసిన పైపులను ఆశాఖ అధికారులు శుక్రవారం తొలగించారు. ఏఈ సురేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని పోటుపాళెం సమీపంలోని పంటకాలువలో కొందరు కాలువను దాటేందుకు ఇరిగేషన్‌శాఖ అనుమతులు లేకుండా అక్రమంగా పైపులను ఏర్పాటు చేసుకున్నారన్నారు. రైతులు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావడంతో పైపులను తొలగించామన్నారు. ఎవరైనా అక్రమంగా పంటకాలువలను ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఈ స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని 220 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో శనివారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ శేఖర్ తెలిపారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని జువ్వలపాళెం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మందబైలు, కారువారిమంచికండ్రిగ, శ్రీనివాసపురం ప్రాంతాల్లో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ తెలిపారు.

16 నుంచి స్కూల్ గేమ్స్

కోట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 16, 17, 18 తేదీల్లో 69వ మండలస్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు. 16వ తేదీ బాలికలకు, 17, 18 తేదీల్లో బాలురకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ చూపినవారిని డివిజన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

నాయుడుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు శుక్రవారం టీడీపీ నాయకుడు జయరాజ్ గోపాల్ ఉచితంగా యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆక్రమిత భూముల్లో పెంచుతున్న నిమ్మ తోటలు - సాగుకు సిద్ధం చేస్తున్న భూమి

మాచవరంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ
ఫిర్యాదు చేసినా స్పందించని రెవెన్యూ అధికారులు

ఓజిలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం మాచవరంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ యదేచ్ఛగా సాగుతోంది. మాచవరం గ్రామానికి సమీపంలోనే నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్ ఉండటంతో ఇక్కడి భూములకు విలువ పెరిగింది. దీంతో ప్రభుత్వ, బంజరు, పరంబోకు భూములు ఆక్రమణకు గురౌతున్నాయి. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోక పోవడంతో కబ్జాదారులు మరింతగా రెచ్చిపోతున్నారు. విలువైన భూములను ఆక్రమించుకుని నిమ్మ, సవక, జామాయిల్ వంటి తోటలను పెంచుకుంటున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన కొందరు విక్రయించి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సర్వే నెంబరు 207, 39 సర్వే నెంబర్లలో 30 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములను గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. వీరిలో ఓ ప్రభుత్వ అధికారి కూడా ఉండటం గమనార్హం. గత కొంతకాలంగా ఇక్కడి భూములపై కన్నేసిన కొందరు ఆక్రమణలకు పాల్పడుతుండడంతో గ్రామంలో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సుబ్రహ్మణ్యం చెరువు కట్టపై కొంత దూరమే పోసిన మట్టి - గడ్డి చెక్కేసి మొక్కలు తొలగించిన వరవ కాలువ

మట్టిపోసి ముగించారు!
మొక్కుబడిగా చెరువు కట్ట, కాలువల పనులు

బాలాయపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) మండలంలోని సుబ్రహ్మణ్యం గ్రామంలోని రెండు చెరువులు, వరవ కాలువల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌డీఆర్ నిధులు రూ.9.85 లక్షలు మంజూరు చేసింది. ఇందులో ఒక చెరువుకు రూ.4.90 లక్షలు, మరొక చెరువుకు రూ.4.95 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో ఆయా చెరువు కట్టలను పటిష్ఠ పరచడంతో పాటు వరవ కాలువల్లో ఉన్న మొక్కలు తొలగించి అభివృద్ధి చేయాలి. అయితే చెరువు కట్ట చివరన కొంతమేర మట్టి తోలి చేతులు దులుపుకున్నారు. అదేవిధంగా సుబ్రహ్మణ్యం పెద్ద చెరువుకు నీరువచ్చే వరవ కాలువ, చిన్న చెరువులకు నీరువచ్చే వరవ కాలువల్లోనూ గడ్డి చెక్కేసి తూతూమంత్రంగా పనులు చేట్టారు. పనులు జరుగుతున్న సమయంలో అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడక పోవడంతో కాంట్రాక్టరు మొక్కుబడిగా మట్టితోలి చేతులు దులుపుకున్నారని రైతులు విమర్శిస్తున్నారు.

డ్రగ్స్‌ను తరిమికొడదాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి

కోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అవగాహనతో మత్తు పానియాలు, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదామని మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని విద్యానగర్‌లో గల శ్రీనివాస జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఐ శివసొమ్మ మాట్లాడుతూ విద్యార్థులు అవగాహన లోపంతో డ్రగ్స్ భారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ప్రతి విద్యార్థి గ్రామాల్లోని యువతను చైతన్య పరచాలని, ఇందుకు మెరైన్ అధికారుల సహకారం ఉంటుందన్నారు. విద్యార్థులు చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు



హుండీలో కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామశక్తి పోలేరమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ ఈవో శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. రూ.22,21,350 నగదు, 1852 గ్రాముల బంగారం, 37 గ్రాములు వెండి వచ్చింది. 25 రోజుల్లో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

వీఆర్‌ఏల వేతనాలు పెంచండి

కోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బండెడు చాకిరీ చేస్తున్న తమపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపడం అన్యాయమని వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15వ తేదీన గూడూరులో నిర్వహించే ఆందోళనలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని వీఆర్‌ఏలు శుక్రవారం తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. మండల వీఆర్‌ఏల అసోసియేషన్ నాయకుడు మణి మాట్లాడుతూ వీఆర్‌ఏలకు వేతనాలు పెంచడంతో పాటు అర్హులైన వారికి వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు.

హిందీ దివస్

గూడూరు అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ సభ హిందీనీ దేశ అధికారిక భాషగా ప్రకటించిన రోజును హిందీ దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు. హిందీ ప్రాముఖ్యత, జాతీయతను పెంపొందించేలా విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శారద, హరిబాబు, హరిబ్రహ్మ, పద్మజ, రషీద, సావిత్రి, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ చాటాలి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ చాటి విజయం సాధించాలని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. శని, ఆదివారం రెండు రోజుల పాటు తూర్పుగోదావరి జిల్లా మండపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న జిల్లా జట్టు సభ్యులకు శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బకాయిలను చెల్లించండి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ సాయితేజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు దయాకర్, అల్లెయ్య, వెంకటేశ్వర్లు నాయుడు, రాజేష్, ఆనంద్, పర్వీన్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



శారదను సత్కరిస్తున్న సర్పంచ్ ఆర్ముగం

తడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్న పల్లిపాళెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్‌వీ శారదను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్ముగం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామదిన్, ఉపాధ్యాయులు భువనేశ్వరి, సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో శుక్రవారం నవజీన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఆర్గనైజర్ బాలాజీ హెచ్‌ఐవీ వ్యాప్తికి గల కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు అనంతరం నాగరాజపురంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయబాబు రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన



ఎరువుల వాడకంపై సూచనలిస్తున్న ఏవో కాంచన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎరువుల వినియోగంపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఏవో కాంచన మాట్లాడుతూ నానో లిక్విడ్ యూరియా వినియోగించడం వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. ఎకరా వరిపైరుకు 500 ఎంఎల్ లిక్విడ్ యూరియా పిచికారి చేస్తే సరిపోతుందన్నారు. అదేవిధంగా జీవన ఎరువులను వినియోగిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం రైతులతో కలిసి మానవహారం చేశారు.

నాయుడుపేట టౌన్: నానో ఎరువులు వినియోగించడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారి గణేష్ అన్నారు. నానో ఎరువుల వాడకంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు.

వాకాడు: పంట భూముల్లో సహజంగా ఉండే మిత్ర సూక్ష్మజీవ సంపదను కాపాడుకునేందుకు రైతులు విరివిగా జీవన ఎరువులను వాడుకొని భూములకు ఆరోగ్యరక్ష కల్పించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి దీప అన్నారు. శుక్రవారం జీవన ఎరువులను వినియోగించడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చన్నారు.

కోట: పట్టణలోటని బీసీ గురుకుల పాఠశాలలో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయశాఖ అధికారి సుచేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రైతులు యూరియాను ఎక్కువగా వాడటం వల్ల నేల భౌతిక స్వభావం దెబ్బతినడంతో పాటు చీడపీడలు ఎక్కువగా ఆశించడం జరుగుతుందన్నారు. ప్రత్యామ్నాయంగా బయో ఫర్టిలైజర్ నానో యూరియా, నానో డీఏపీలను నివియోగించడం వల్ల నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



అశ్రిత్ నంద

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి దర్శనానికి వచ్చి తిరిగి వెళ్లే సమయంలో రైల్వేస్టేషన్‌లో మూడేళ్ల బాలుడు తప్పిపోయాడు. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ వెంకటస్వామి సమాచారం మేరకు... తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన జీ.సుబ్రహ్మణ్యం, నవ్య దంపతులు శ్రీసిటీలో ఓ పరిశ్రమలో పని చేస్తున్నారు. తడలో నివాసం ఉంటున్న వీరు శుక్రవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ ఆవరణలో ఉన్న కుటుంబ కుటుంబ సభ్యులెవరికీ చెప్పకుండా సుబ్రహ్మణ్యం తన కుమారుడు అశ్రిత్ నందను తీసుకొని ఆటోలో రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఆటో దిగి ప్లాట్‌ఫారం వద్దకు వెళ్లే క్రమంలో అశ్రిత్ నంద తప్పిపోయాడు. రైల్వేస్టేషన్ సమీపంలో ఏడుస్తూ ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని స్థానికులు గుర్తించి ఆర్‌పీఎఫ్ పోలీసులు అప్పగించారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఆటోలో వచ్చి దిగిన సుబ్రహ్మణ్యం కుమారుడిని పట్టించుకోకుండా నేరుగా మూడో ప్లాట్‌ఫారంలో ఉండే లోకల్ మెమూ ఎక్కి వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఆటోలో బాలుడితో పాటు వచ్చింది ఎవరు, ఎందుకు పట్టించుకోకుండా వెళ్లిపోయడని ఆర్‌పీఎఫ్ పోలీసులు వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ఇంతలో విషయం తెలుసుకున్న బాలుడి తల్లి నవ్య బంధువులతో కలిసి రైల్వేస్టేషన్‌కు వచ్చారు. సుబ్రహ్మణ్యంకు కొన్ని రోజులుగా మతిస్థిమితం లేదని, అమ్మవారి గుడికి వచ్చాక తమకు తెలియకుండా బాలుడిని తీసుకొచ్చేశాడని చెప్పారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు బాలుడిని తల్లికి అప్పగించారు.

సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి

గూడూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీతారాం ఏచూరి చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏచూరి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశనుంచే ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. ప్రజలు హక్కులను కాపాడడం, సామాజిక న్యాయం కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు. అనంతరం సీపీఎం కార్యాలయానికి సుబ్రహ్మణ్యంరెడ్డి సహకారంతో అందజేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, బీవీ రమణయ్య, వెంకట్రామిరెడ్డి, ప్రసాద్, చంద్రయ్య, శంకరయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

అవసరం మేరకే యూరియా

వడమాలపేట,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాల మేరకు ముందస్తుగానే యూరియాను అందించామని పుత్తూరు వ్యవసాయ సంచాలకురాలు అక్కీదేవి చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎరువుల వినియోగం, పంపిణీపై రైతులకు అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో భూ సాంద్రత, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగంలో మెలకువలపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయం ఎదుట రైతులతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలం సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, విద్యుత్ లైన్ల వెంట చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ భాస్కర్ పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పైడిపల్లి, కళ్యాణపురం, దిగువ పుత్తూరు, పరమేశ్వర మంగళం సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ వితరణ



పుత్తూరు అర్బన్, సెప్టెం బర్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంబీ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రానికి బీజేపీ మండల కన్వీనర్ హరిబాబు ఎల్‌ఈడీ టీవీని వితరణగా అందజేశా రు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నదానం చేశారు. ఉదయ కుమార్, శేఖర్ మూర్తి, వెంకటరమణ, శేషారెడ్డి, మహేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి: ఆపస్

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజి డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా సభ్యత్వ అభియాన్‌లో భాగంగా శుక్రవారం పుత్తూరు మండలంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ కమిటీని ఇంత వరకు నియమించలేదన్నారు. కాంప్లెక్స్ స్థానాల్లో పనిచేస్తున్న గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులకు శాశ్వత స్థానాలు కేటాయించాలని ఆపస్ జిల్లా గౌరవాధ్యక్షులు మేకల సుబ్రమణ్యం కోరారు. ఆపస్ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి సుబ్రమణ్యం, క్రీడా కన్వీనర్ గురప్ప, అకడమిక్ కన్వీనర్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పరమేశ్వర మంగళం వద్ద స్కూటర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అరక్కోణానికి చెందిన సతీష్‌గా గుర్తించారు. మరో వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

సత్యవేడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 28 పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంవ్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో త్రివిక్రమ రావు తెలిపారు. సత్యవేడు మేజర్ పంచాయతీకి రూ.14,23,607 విడుదలయ్యా యి. అల్లప్పగుంట పంచాయతీకి రూ.1,44,654, ఏఎం పురానికి రూ.1,13,269, ఆంబాకం రూ.2,14,580, అరూరు రూ.1,60,416, చెరివి రూ.2,27,499, చిన్నఈటిపాకం రూ.1,25,696, దాసుకుప్పం రూ.5,22,305, ఇరుగుళం రూ. 2,82,178, జడేరి రూ.83,896, కాదిరివేడు రూ.1,95,928, కాళమనాయుడుపేట రూ.1,83, 931, కన్నావరం రూ.2,42,695, కొల్లడం రూ.1,09,956, కొత్తమారికుప్పం రూ.1,63,060, మదనంబేడు రూ.4,01, 088, మదనంజేరి రూ.1,08,858, మల్లవారిపాళెం ఈస్ట్ రూ.2,81,833, ఎన్ఆర్ అగ్రహారం రూ.65,811, పీలీపురం రూ.3,47,964, పెద్దఈటిపాకం రూ.2,45,601, పుదుకుప్పం రూ.1,30, 345, రాజగోపాలపురం రూ.2,21,199, రేపల్లెవాడ రూ.1,31,556, శిరుణంబూదూరు రూ.2,33,595, వానెల్లూరు రూ.2,86,786, వీఆర్ కండ్రిగ రూ.81,118, మల్లవారిపాళెం వెస్ట్ పంచాయతీకి రూ. 65,548 విడుదలయ్యాయి.

ఏర్పేడు ఎంపీపీగా శ్రీనివాసులుయాదవ్


ఎంపీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులుయాదవ్

ఏర్పేడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు ఎంపీపీగా జమ్మళ్ల శ్రీనివాసులు యాదవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏర్పేడు ఎంపీపీగా ఉన్న వల్లం ఎంపీటీసీ సభ్యురాలు గీత వ్యక్తిగత కారణాలతో ఈ యేడాది ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను జడ్పీ సీఈవో ఆగస్టు 21న ఆమోదించారు. అనంతరం వైస్ ఎంపీపీ శ్రీనివాసులుయాదవ్‌ను ఎంపీపీగా ప్రమోట్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయన్ను ఎంపీడీవో సౌభాగ్యం, కార్యాలయ సిబ్బంది, వైసీపీ నాయకులు, కార్యకర్తలు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి యువతకు ఏచూరి ఆదర్శం


సత్యవేడులో ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్యవేడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేటి యువతకు దివంగత సీపీఎం నేత సీతారాం ఏచూరి ఆదర్శమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి జనార్దన్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ ప్రాంతీయ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏచూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనార్దన్, రమేష్ సంయుక్తంగా మాట్లాడుతూ సీతారాం ఏచూరి సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినప్పటికీ కమ్యూనిస్టు సిద్ధాంతాలతో అభ్యుదయ జీవితాన్ని గడిపిన గొప్ప లౌకికవాది అన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారన్నారు. కార్మిక, కర్షక, రైతు, వ్యవసాయ కూలీల పోరాటాలకు దేశవ్యాప్తంగా తన మద్దతు తెలిపి, వారిపట్ల నిజాయితీగా పార్లమెంటులో గళాన్ని వినిపించిన మహా నేత అని కొనియాడారు. కార్యక్రమంలో అరుణాచలం, మునస్వామి, మురళి, కృష్ణయ్య, అనిల్, కొల్లాపురి, లక్ష్మీ, తిరుమలరెడ్డి, మహి తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు మురుగేశ్, అముదమ్మ, దక్షిణామూర్తి, పద్మ, మేఘన, ఉమా, వల్లెమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరువు భత్యాన్ని విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు బత్యాన్ని వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నిరసన వారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రరవారం ఏపీటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ ప్రకటించి మధ్యంతర భృతిని 30శాతం ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రామదాసు, ఉదయ్‌కుమార్, మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యం రెడ్డి, శివ, పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు. ఇక శ్రీకాళహస్తి పట్టణంలో కూడా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గోపాల్, వెంకటాద్రి, సురేష్‌బాబు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ కేవీబీపురం మండలశాఖ శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన తెలిపి వినతిపత్రాన్ని అందజేసినట్టు రమేష్, గురునాథం, మురళి, జనార్దన్, మునస్వామి తెలిపారు.

ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని ఎంచుకోవాలి


గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ర్యాలీ

ఏర్పేడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని పాపానాయుడుపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. కళాశాలలో మిషన్ శక్తి సంకల్పపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనితవాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. బాలికలకు కిశోర వికాసం ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, జీవన నైపుణ్యాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఉమ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పార్లమెంట్ డెలిగేట్స్ కమిటీకి సాదర స్వాగతం



రేణిగుంట సెప్టెంబర్12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు డెలిగేట్స్ కమిటీకి తిరుపతి విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, విమానాశ్రయ అధికారులు సాదర స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ఈనెల 13, 14 తేదీల్లో తిరుపతిలో మహిళా సాధికారతపై జరిగే జాతీయ సదస్సులో పాల్గొనడానికి శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి ఎయిల్ అలయన్స్, సాయంత్రం ఇండిగో విమానంలో 30 మంది సభ్యులు విమానాశ్రయం చేరుకున్నారు. అనంతరం రోడ్డు మార్గాన తిరుపతి నగరంలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌కు చేరుకున్నారు.

చెన్నై బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం



వరదయ్యపాళెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చెన్నై బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. తిరుపతి నుంచి చెన్నైకు వెళుతున్న చెన్నై ఆర్టీసీ బస్సు విద్యుత్ కార్యాలయం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికులకు అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం ఎక్స్‌కవేటర్ సాయంతో బస్సును గోతినుంచి తీశారు. కాగా మండలంలో ఇటీవల గ్యాస్‌పైప్ లైన్ ఏర్పాటుకు తీసిన గోతుల వల్ల రోడ్డు పక్కన కాలువలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్, 11 కేవీ లైన్ల నెలవారీ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

నిమ్మ సాగుపై రైతుల అనాసక్తి


పదవమైలు సాగులో ఉన్న నిమ్మ తోటలో అంతరపంట


బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సిరులు పండించిన నిమ్మ నేడు కనమరుగవుతోంది. బీఎన్‌కండ్రిగ, నీర్పాకోట, కాంపాళెం, కుక్కంబాకం, పాలేడు, ఆర్.అనంతపురం, కాటూరు గ్రామాల్లో ప్రధాన పంటలతో పోటీ పడి నిమ్మను సాగు చేసేవారు. బీఎన్‌కండ్రిగలో అయితే అధిక శాతం రైతులు నిమ్మను సాగు చేసి అటు ఉత్తరాది, ఇటు దక్షిణాది రాష్ట్రాలకు నిమ్మకాయలను ఎగుమతి చేసేవారు. నిమ్మ సాగుతోనే మండలంలో పలువురు రైతులు స్థిరపడ్డారు. పదవమైలు దగ్గర 30 సంవత్సరాల క్రితం షుగర్ ఫ్యాక్టరీ రావడంతో నిమ్మ తోటల స్థానంలో చెరకు సాగు చేయడం మొదలు పెట్టారు. ఫ్యాక్టరీ పెట్టుబడులు అందించడంతో చెరకు సాగు ఊపందుకుంది. ఆ తరువాత చెరకు ఫ్యాక్టరీ మూతపడడంతో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అలా వందల ఎకరాల్లో ఉన్న నిమ్మ తోటలు ప్రస్తుతం బీఎన్‌కండ్రిగ, కుక్కంబాకం, కనమనంబేడు, నీర్పాకోట, పదవమైలులో 30 ఎకరాలకు చేరుకుంది. ఆ తోటల్లో కూడా అంతర పంటలు సాగు చేస్తున్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో హెక్టర్‌కు రూ. 50వేలు, ఉపాధి హామీ పథకంలో ఉచితంగా నిమ్మ సాగును ప్రోత్సహిస్తున్న రైతులు ఆసక్తి చూపడం లేదు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం


జ్యోతి, సుధాకర్ నాయుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడుకండ్రిగ మండల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన జ్యోతి, ఆమె భర్త టీడీపీ మండల అధ్యక్షుడు మావిళ్ళపల్లి సుధాకర్‌నాయుడిని మండలంలోని పార్లపల్లి, పల్లమాల, కొత్తపాళెం, తిమ్మాభూపాలపురానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం సన్మానించారు. దాముర్రెడ్డి, సుధాకర్, రవీంద్ర, రవి, కృష్ణామూర్తి, ప్రసాద్‌నాయుడు, మణి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు సన్మానం



పిచ్చాటూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు పీఏసీఎస్ విండో చైర్మన్‌గా ఎన్నికైన జయచంద్రనాయుడు శుక్రవారం తిరుపతిలోని కూరపాటి శంకర్‌రెడ్డి నివాసంలో ఆయనతోపాటు పలువురు టీడీపీ నాయకులను సన్మానించారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

డిపో మేనేజరుకు సన్మానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజరుగా శుక్రవారం రేవతి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను యూనియన్ నాయకులు సత్కరించారు. ఇక్కడ మేనేజరుగా పనిచేస్తున్న మునిచంద్రయ్య తిరుమల డిపోకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మదనపల్లి డిపో నుంచి రేవతి బాధ్యతలు చేపట్టారు.

అధ్యాపకురాలికి సన్మానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కుమారి నీరజను శుక్రవారం అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. విద్యాభివృద్ధికి ఆమె చేస్తున్న సేవలను కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ దీనదయాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడులో నానో యూరియాపై మండల వ్యవసాయాధికారి షణ్ముగం అవగాహన కల్పించారు. అర లీటరు నానో యూరియా బస్తా యూరియా, డీఏపీలతో సమానమని తెలిపారు. అరలీటర్ రూ.250లకు లభిస్తుందని, పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. నానో యూరియా వినియోగిస్తామని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రంలో ఏఈవో రేవతి, రైతులు పాల్గొన్నారు.

నేడు 'ఉగ్గుపాల నుండే..' పుస్తకావిష్కరణ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం పేరూరు బాలసుబ్రమణ్యం రాసిన 'ఉగ్గుపాల నుండే..' కవితల సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు అరసం అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి



నిరసనలో పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడుతూ... మెస్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచాలని, సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న కుక్, వాచ్‌మన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జాకీర్, సమీర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్


ఏర్పేడు, కల్లివట్టు పాఠశాలల్లో విద్యార్థులకు బహుమతుల పంపిణీ

ఏర్పేడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను నిర్వహించారు. వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం మారయ్య, హిందీ ఉపాధ్యాయులు వెంకటరమణ, షంషేర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం సందర్భంగా హిందీ ఉపాధ్యాయురాలు మాధవీలత విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



రేణిగుంట సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఎంపీడీవో గా రవిచంద్ర బాధ్యతలు స్వీకరించారు. పాకాల ఎంపీడీవో కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న రవిచంద్ర పదోన్నతిపై ఎంపీడీవోగా రేణిగుంటకు బదిలీ అయ్యారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు వైద్య సేవలు


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఈవో

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపులో భాగంగా ప్రత్యేక అవసరాల గల పిల్లలకు వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, సత్యవేడు నియోజకవర్గానికి చెందిన వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురానికి చెందిన సుమారు 130మంది ప్రత్యేక అవసరాల పిల్లలు హాజరయ్యారు. వారిని పరీక్షించి కావాల్సిన పరికరాలను నమోదు చేసుకున్నారు. డీఈవో కే.వి.ఎన్.కుమార్, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్, సీఎంవో సురేష్, ఏటీఎం సుధాకర్‌నాయుడు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16నుంచి క్రీడా పోటీలు

పిచ్చాటూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 16 నుంచి అండర్ 14, 17 మండలస్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని పీఈటీలు అమ్ములు, హేమాద్రి, దుర్గాదేవి, స్వర్ణ, రమాదేవి, జ్యోతి తెలిపారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, యోగా, చెస్, బ్యాడ్మింటన్ క్రీడా అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. మండలంలోని ప్రైవేటు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం
ఎమ్మెల్యే ఆదిమూలం


బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): బాధితులను ఆదుకోవడమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. శుక్రవారం సాయంత్రం నారాయణవనంలో పి.పరంధాం కు రూ.62,983, ఎస్.భక్తవత్సలానికి రూ.1,00,791, డి.కృష్ణయ్యకు రూ.60,712, వి.మోహన్‌కు రూ.31,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని ఎంఈవో రవీంద్రనాథ్ చెప్పారు. మండలంలోని కాటూరు పంచాయతీలోని ఓటువాని గిరిజన కాలనీలో బడి మానేసిన పదిమంది పిల్లలకు, వారి తల్లిదండ్రులకు శుక్రవారం ఆయన చదువుకుంటే కలిగే ఉపయోగాలను వివరించారు.

పిచ్చాటూరు సింగిల్‌విండో చైర్మన్‌గా జయచంద్రనాయుడు



పిచ్చాటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు పీఏసీఎస్ సహకార సంఘం విండో చైర్మన్‌గా బంగాళా పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ జయచంద్ర నాయుడు ఎన్నికయ్యారు. అలాగే విండో డైరెక్టర్లుగా పిచ్చాటూరుకు చెందిన జయచంద్రారెడ్డి, నీరువాయికి చెందిన నాగరాణి నియమితులయ్యారు.

కేవీబీపురం సింగిల్‌విండో చైర్మన్‌గా ప్రకాష్‌నాయుడు



కేవీబీపురం, సెప్టెంబరు 12(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఆరె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్రకాష్‌నాయుడు సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. టీడీపీ అధిష్ఠానం ఆయన సేవలను గుర్తించి చైర్మన్‌గా ప్రకటించింది. తనకు పదవి రావడానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వకర్త శంకర్‌రెడ్డి కృషి చేసినట్టు ప్రకాష్‌నాయుడు తెలిపారు. పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు ప్రకాష్ నాయుడిని ఆయన నివాసంలో సన్మానించారు.

అంగరంగ వైభవంగా ధర్మరాజస్వామి ఊరేగింపు

పిచ్చాటూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి తిరుణాళ్లలో శుక్రవారం ధర్మరాజ స్వామిని గ్రామంలో మేళతాళాల నడుమ ఊరేగించారు. డప్పులకు అనుగుణంగా యువకులు ప్రదర్శించిన నృత్యాలు అబ్బుపరచాయి.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద రమణమూర్తి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కేంద్ర మంత్రి ఎస్పీసింగ్ బఘేల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

